నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | శుక్రవారం 6 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



వర్షానికి తడిసిన పత్తి

# వర్షానికి తడిసిన ధాన్యం, పత్తి

*నెన్నెల మండలంలో గురువారం కురిసిన అకాల వర్షానికి కల్లాల్లో ఉన్న ధాన్యంతో పాటు చేలల్లో ఉన్న పత్తి తడిసిపోయింది. నెన్నెల, గొల్లపల్లి, మైలారం, జోగాపూర్. ఘన్‌పూర్, మన్నెగూడెం గ్రామాల్లో సన్న వడ్లు కల్లాల్లో పోయగా, ఒక్కసారిగా వర్షం పడడంతో తడిసిపోయింది. కూలీల కొరత కారణంగా ఏరని పత్తి వర్షానికి తడిసి ముద్దయ్యింది. పత్తి రంగు మారి ధర రాదని రైతులు ఆందోళన చెందుతున్నారు. - నెన్నెల, డిసెంబర్ 5*



ధాన్యం కుప్పలపై కవర్లు కప్పుతున్న రైతులు

## ప్రజలను భయభ్రాంతులకు గురిచేయొద్దు

ఆసిఫాబాద్ టౌన్,డిసెంబర్ 5 : జిల్లాలో పులుల సంచారమున్న నేపథ్యంలో స్పష్టమైన సమాచారాన్ని మాత్రమే ప్రజలకు తెలియజేసేందుకు కృషి చేయాలని, తప్పుడు సమాచారంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పాత్రికేయ మిత్రులు సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చిన సమాచారాన్ని ప్రచురించే ముందు అటవీశాఖ అధికారులతో మాట్లాడి ధ్రువీకరించుకోవాలని కోరారు. తప్పుడు వార్తలు ప్రచారం చేయడమేగాక వాటిని సామాజిక మాధ్యమాల్లో పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కనిపించిన పులి

### చెట్టు ఎక్కి ప్రాణాలు కాపాడుతున్న రైతులు

కన్నెపల్లి, డిసెంబరు 5 : భీమిని మండలం చెన్నాపూర్ గ్రామ శివారులో పులి కనబడడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. గురువారం చెన్నాపూర్ గ్రామ సమీపంలోని మిర్చి పంటకు నీరు పెడుతున్న రైతులు టాకిరే బాపురావు, గోపాల్‌కు పులి గాండ్రింపులు వినబడగా, వెంటనే చెట్టు ఎక్కి ప్రాణాలు దక్కించుకున్నట్లు వారు తెలిపారు. పులి అక్కడి నుంచి వెళ్లిపోగానే గ్రామానికి వచ్చి జరిగిన విషయాన్ని తెలిపారు. ఫారెస్టు అధికారులు వివరాలు సేకరించారు. చీకటి పడడంతో ఘటనా స్థలానికి అటవీ అధికారులు వెళ్లలేదు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

## ఎస్సార్పీ-3 గనిని సందర్శించిన సీఎండీ



శ్రీరాంపూర్ ఎస్సార్పీ-3గనిని సందర్శిస్తున్న సీఎండీ బలరామ్

శ్రీరాంపూర్, డిసెంబర్ 5 : శ్రీరాంపూర్ ఏరియా ఎస్సార్పీ-3 గనిని బుధవారం రాత్రి సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ) ఎన్ బలరామ్ సందర్శించారు. జీఎం కో ఆర్డినేషన్ సుభానీ, శ్రీరాంపూర్ జీఎం ఎల్‌వీ సూర్యనారాయణతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీఎండీ బలరామ్ మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగికి కేటాయించిన 8 గంటల పనిని నిబద్ధతతో చేయాలని కోరారు. సంస్థ అభివృద్ధికి ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు. ఉద్యోగులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఏజెంట్ వెంకటేశ్వర్లు, సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి పాల్గొన్నారు.

# ప్రైవేట్‌కే సన్న వడ్లు

- సర్కారు ఇచ్చే మద్దతుకు బోనస్ కలుపుకున్నా.. దళారుల వద్దే ఎక్కువ ధర
- కొనుగోలు కేంద్రాల్లో కోతలతో రైతులపై భారం
- వ్యాపారుల వద్ద వ్యయప్రయాసలేవీ లేకపోవడంతో మొగ్గు చూపుతున్న అన్నదాతలు
- అన్ని రకాలకు బోనస్ ఇవ్వకపోవడమూ ఓ కారణమే

మంచిర్యాల, డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం సన్న రకాలకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పినప్పటికీ.. రైతులు మాత్రం దళారులకే విక్రయిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు మద్దతు ధర రూ.2320 ఉండగా, బోనస్‌తో కలిపి రూ.2820 ఇస్తుండగా, వ్యాపారులు మాత్రం రూ. 2800 నుంచి రూ. 3000 వరకు చెల్లిస్తుండడం.. దీనికితోడు తేమ ఉన్నా.. లేకున్నా కొనుగోలు చేస్తుండడంతో వారికే అమ్మేందుకు ఆసక్తి చూపుతున్నారు. అలాగే హమాలీ చార్జీల కింద రూ.40 నుంచి రూ.50 వరకు వసూలు చేయడం.. ప్రతి క్వింటాలుపై మూడు కిలోల వరకు కోత విధించడం.. సుతీల్ తెచ్చుకోవడం.. వాటికి రంగులు వేయడం వంటివి తలకు మించిన భారంగా భావించి వారంతా వ్యాపారస్తులనే ఆశ్రయిస్తున్నారు.

### కొన్ని రకాలకే పరిమితం.. బోనస్‌పై సందేహాలు..

కేవలం 33 రకాలకే రూ. 500 బోనస్ ఇస్తామని సర్కారు మెలిక పెట్టింది. కొన్ని రకాల ధాన్యాల పేర్లు చెప్పి, వాటినే సన్నాలుగా పరిగణిస్తామని స్పష్టం చేసింది. ఆ 33 రకాల్లోనూ గ్రేన్ క్యాలిఫర్‌లో కొలుస్తారు. ధాన్యం గింజ పొడువు 6 ఎం.ఎం కంటే తక్కువగా, వెడల్పు 2 ఎం.ఎం కంటే తక్కువగా ఉండి. మొత్తం నిష్పత్తి 2.5 ఎం.ఎం కంటే ఎక్కువగా ఉంటేనే దానికి బోనస్ వస్తుంది. పైగా ధాన్యంలో తేమ శాతం 17 శాతం కంటే ఎక్కువగా ఉండొద్దు. మంచిర్యాల జిల్లాలో వానాకాలం సీజన్‌లో 3.30 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఇందులో 65శాతానికి పైగా సన్నాలే ఉన్నాయి. కాకపోతే మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వం చెప్పిన 33 రకాల కంటే ప్రైవేట్ కంపెనీలకు చెందిన సన్న రకాలను ఎక్కువ మంది రైతులు సాగు చేశారు. జిల్లాలో సాగైన సన్నరకం ధాన్యంలో 50 శాతం నుంచి 60 శాతం అవే ఉంటాయని వ్యవసాయ అధికారులే చెబుతున్నారు. పైగా ఇప్పటికే గవర్నమెంట్‌కు అమ్మిన సన్నధాన్యానికి బోనస్ వస్తుందో రాదో అని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. భీమారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతు కల్లంలో సన్న ధాన్యం ఆరబోసి ఉంది. తేమ శాతం 17 కంటే తక్కువగా ఉన్నప్పటికీ ప్రభుత్వానికి అమ్మనని ఆ రైతు చెప్పాడు. కారణం ఏమిటంటే బోనస్ వస్తదో రాదో.. వంద రూపాలు తక్కువ ఇచ్చినా ప్రైవేట్ వాళ్లకే అమ్ముకుంటా. సుతీల్‌కు, వాటికి వేసే రంగులకు, హమాలీలకు ఆ వంద కంటే ఎక్కువ ఖర్చు అవుతున్నయ్. అలాంటప్పుడు గవర్నమెంట్‌కు అమ్ముడుకంటే ప్రైవేట్‌కే అమ్ముడు మంచిదని ఆ రైతు చెప్పుకొచ్చాడు. జిల్లాలో ఇప్పటి వరకు 315 వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, 11,635 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించి 673 మంది రైతుల ఖాతాల్లో రూ.10.80 కోట్లు జమ చేసినట్లు అధికారులు తెలిపారు. సన్నాలకు బోనస్ విషయంలో ఎలాంటి సందేహాలు అవసరం లేదని, ప్రభుత్వం పేర్కొన్న రకాలను నిర్భయంగా విక్రయించాలని కోరుతున్నారు.



కోటపల్లి మండలం పారుపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో దొడ్డు రకం వడ్లు

### వ్యాపారులకే అమ్ముతున్నరు



*మందమర్రి రూరల్, డిసెంబర్ 5 : సారంగపల్లి, పొన్నారం, బొక్కలగుట్ట గ్రామపంచాయతీల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో రైతులు వడ్లు అమ్మడం లేదు. ప్రభుత్వ మద్దతు ధర-బోనస్ కంటే ప్రైవేట్ వారే ఎక్కువ చెల్లిస్తున్నరు. అందుకే రైతులు వ్యాపారులకే అమ్ముకోవడానికి మొగ్గు చూపుతున్నరు. - కాసర్ల రమేశ్, సారంగపల్లి*

### ప్రైవేటోళ్లు వెంటనే డబ్బు లిస్తున్నరు



*మందమర్రి రూరల్, డిసెంబర్ 5 : ప్రైవేట్ వ్యాపారులు ఇళ్ల వద్దకే వచ్చి వడ్లు కొంటున్నరు. అప్పటికప్పుడే డబ్బులిస్తున్నరు. పైగా కొనుగోలు కేంద్రాల్లో కంటే ఎక్కువ డబ్బులిస్తున్నరు. అట్లనే హమాలీ చార్జీలు, సుతీల్ ఖర్చులు తప్పుతున్నయి. అందుకే రైతులంతా దళారులకే విక్రయించేందుకే ఇష్టపడుతున్నరు. - పెద్దపల్లి వెంకటయ్య రైతు,సారంగపల్లి*

### ప్రభుత్వం చెల్లించే మద్దతు ధర సరిపోదు



*కోటపల్లి, డిసెంబర్ 5 : ప్రభుత్వం చెల్లించే రూ.2820 మద్దతు ధర రైతులకు సరిపోదు. రూ. 500 బోనస్ కూడా వస్తుందో లేదోనన్న అనుమానముంది. అదే ప్రైవేట్ వ్యాపారులు అయితే ఎలాంటి ఆంక్షలు లేకుండా ధాన్యాన్ని ఎక్కువ ధరకు తీసుకుపోతున్నరు. అందుకే సన్న రకం ధాన్యాన్ని ఇండ్లకు తరలించి మంచి ధర కోసం ఎదురు చూస్తున్నాం. అనేక మంది రైతులు కొనుగోలు కేంద్రాల్లో దొడ్డురకం వరి ధాన్యమే విక్రయిస్తున్నారు. - పూరెళ్ల మహేశ్, పారుపల్లి*

### ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తేనే లాభం



*కోటపల్లి, డిసెంబర్ 5 : సన్న రకం వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో కంటే ప్రైవేట్‌లో విక్రయిస్తేనే ఎక్కువ లాభం ఉంటుంది. ప్రభుత్వం చెల్లించే ధర బోనస్‌తో కలిపి రూ.2820. ఇందులో క్వింటాలు వడ్లకు 2 నుంచి 3 కిలోల తరుగు తీస్తున్నారు. హమాలీ చార్జీల కింద రూ.50 తీసుకుంటున్నరు. లారీ డ్రైవర్‌కు క్వింటాల్‌కు రూ.2 చొప్పున అదనంగా చెల్లించాలి. అదే ప్రైవేటోళ్లు నేరుగా ఇంటికి వచ్చి తూకం వేయడంతో పాటు ఎలాంటి షరతులు లేకుండా వెంటనే డబ్బులు ఇస్తున్నారు. దీంతో ప్రైవేట్‌కు విక్రయిస్తేనే ఎక్కువ లాభం వస్తుంది. ప్రభుత్వం చెల్లించే ధర కంటే ప్రైవేట్‌లో రూ.50 నుంచి రూ.100 వరకు ధర ఎక్కువగా ఉంటుంది. - కొట్టె రాఘవేందర్, కోటపల్లి*

# పేద బిడ్డల ప్రాణాలంటే లెక్కలేదా?

**ఇంకెంత మందిని పొట్టనబెట్టుకుంటే మీ కడుపు మంట చల్లారుతుంది**

- సర్కారుపై బీఆర్‌ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ ఫైర్
- తాండూర్‌లోని జ్యోతిబాపూలే గురుకులం సందర్శన
- అడ్డుకున్న పోలీసులు.. నాయకుల ధర్నా
- ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఉద్యమించాలని పిలుపు

తాండూర్, డిసెంబర్ 5 : గురుకుల విద్యార్థుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని, పేద బిడ్డల ప్రాణాలంటే సర్కారుకు లెక్కలేదా అని బీఆర్‌ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు గురువారం తాండూరు మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల సందర్శనకు నాయకులతో కలిసి వెళ్లగా యాజమాన్యం, పోలీసులు అడ్డుకోవడంపై మండిపడ్డారు. బీఆర్‌ఎస్వీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాఠశాల ముందు ధర్నాకు దిగారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న పరిస్థితులు, సౌకర్యాలను పరిశీలించేందుకు వచ్చిన తమను అడ్డుకోవడం దారుణమన్నారు. విద్యార్థులను కలవకుండా అక్రమ అరెస్టులకు పాల్పడడం పలు అనుమానాలకు తావిస్తున్నదన్నారు. ఈ సందర్భంగా శ్రావణ్ మీడియాతో మాట్లాడుతూ.. పాఠశాలలో సౌకర్యాలు లేక ఫుడ్ పాయిజన్‌తో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 48 మంది విద్యార్థులు చనిపోయారని, ఇంకెంత మందిని పొట్టనబెట్టుకుంటే మీ కడుపుమంట చల్లారుతుందని సర్కారును ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో 1000కి పైగా గురుకులాలను ఏర్పాటు చేసి గొప్పగా సౌకర్యాలు కల్పిస్తే.. కాంగ్రెస్ ప్రజా పాలనలో భ్రష్టు పట్టిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు చదువుకోకూడదనే ఒక కుట్రపూరిత ఆలోచనతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో పాటు నిధులు కూడా కేటాయించడం లేదని ఆయన విమర్శించారు. ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని ఆరోపించారు. డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీలు పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఏ ఒక్కటీ అమలు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని.. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును అర్థం చేసుకోవాలన్నారు. పేద పిల్లల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందని, అందుకు అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాండూరు మండల మాజీ ఎంపీపీ పూసల ప్రణయ్‌కుమార్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు చెన్నమల్ల చైతన్య, సీనియర్ నాయకులు పెర్క రాజన్న, ఖమ్మం చింటూ, బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు సారయ్య, మోహ, అరుణ్, సాయి, లతీఫ్, రాకేశ్, జగన్, వెంకటేశ్, లడ్డు, షారుఖ్, ముసవీర్, సోఫియన్ పాల్గొన్నారు.



తాండూర్‌లోని ఎంజేపీ పాఠశాల గేటు ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

# గొర్రెలు, మేకల మందపై అడవి జంతువు దాడి

**బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఘటన**

- 20 మూగజీవాలు మృతి.. పదింటికి పైగా గాయాలు
- పులి అనుకొని దాక్కున్న పశువుల యజమానులు
- టైగర్ కాదన్న ఫారెస్టు అధికారులు
- భయంతో చేల నుంచి వెనుదిరిగిన కూలీలు



దాడిలో గాయపడిన మేక



పులి భయంతో చేల నుంచి ఇంటికి వస్తున్న కూలీలు



మృతిచెందిన మేకలు, గొర్రెలను పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

చింతలమానేపల్లి, డిసెంబర్ 5 : మండలంలోని రణవెల్లి గ్రామ సమీపంలోని ప్రాణహిత నది ఒడ్డున ఉన్న గొర్రెలు, మేకల మందపై బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని అటవీ జంతువు దాడి చేయగా, 20 మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. మరో పదికి పైగా గొర్రెలు, మేకలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రాణహిత నది మధ్యలో ఉన్న కుర్తాలో పశువులకు మేత ఎక్కువగా ఉండడంతో వాటిని అక్కడే నది ఒడ్డున తాత్కాలిక కంచె ఏర్పాటు చేసి అందులో మేకలు, గొర్రెలను కట్టేసి దండిక బాపు, బీంకరి శంకర్ కాపలా ఉన్నారు. రాత్రి పది గంటల సమయంలో ఉన్నట్టుండి ఏదో జంతువు మంద మీద పడి మేకలు, గొర్రెలపై దాడి చేసినట్లు ప్రత్యేక్ష సాక్షులు బాపు, శంకర్ తెలిపారు. పులి అనుకొని వారు దాక్కున్నారు. గురువారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు మొదట పెద్దపులి దాడిగా భావించారు. కానీ అక్కడున్న పగ్ మార్క్‌లు పులివి కాదని చెప్పారు. తమకు జీవనాధారమైన గొర్రెలు, మేకలను కోల్పోయామని, తమకు న్యాయం చేయాలని రణవెల్లికి చెందిన దండికె బాపు, రాగుండి శంకర్, భీంకార్ శంకర్ అధికారులను కోరారు. ఈ విషయమై కర్జెల్లి ఇన్‌చార్జి రేంజ్ ఆఫీసర్ ఇక్బాల్ హుస్సేన్‌ను వివరణ కోరగా మేకలు, గొర్రెల మందపై దాడి చేసింది పులి, చిరుత పులి కాదని.. వేరే ఏదో జంతువు అయి ఉంటుందని, నిపుణులు ధ్రువీకరిస్తారన్నారు. ఘటనా స్థలాన్ని కౌటాల సీఐ రమేశ్ పరిశీలించారు. ఫారెస్టు బీట్ అధికారులు ప్రభాకర్, రుపారాణి పరిశీలించి పగ్ మార్క్‌లు, ఇతర వివరాలు సేకరించారు. పశువులపై పులి దాడి జరిగినట్లు తెలియడంతో నది పరివాహక ప్రాంతంలో వ్యవసాయ పనులు చేస్తున్న కూలీలు భయంతో ఇళ్లకు తిరిగి వచ్చారు.

## అడవులను కాపాడుకోవడం అందరి బాధ్యత

### డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంతోష్

మందమర్రి రూరల్, డిసెంబర్ 5 : అడవులను కాపాడుకోవడం అందరి బాధ్యత అని డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం సారంగపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని తుర్కపల్లి గ్రామంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్-51ఏ-బీ ప్రకారం చెట్లు నరికినా, వన్యప్రాణులను వేటాడినా పెద్ద నేరమన్నారు. అడవిలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వన్యప్రాణులు అంతమవుతాయని, అలాంటి ఘటనలు జరిగితే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రేవతి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ఎస్ రాజేశ్వరి, ఎం.రజిత, కే.రమేశ్, శ్రావణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సంతోష్